ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



అనకాపల్లి

జిల్లా వార్తలు

గురువారం 4 డిసెంబరు 2025

నేడు మంత్రి నారా లోకేశ్ రాక



విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ గురువారం నగరానికి వస్తున్నారు. ఇక్కడ నుంచి పార్వతీపురం మన్యం జిల్లా భామిని వెళతారు. ఈ నెల ఐదో తేదీన జరగనున్న మెగా పేరెంట్ టీచర్ సమావేశంలో మంత్రి పాల్గొంటారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం...గురువారం మధ్యాహ్నం 2.50 గంటలకు విజయవాడలో బయలుదేరి 3.30 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఇక్కడ నుంచి రోడ్డు మార్గంలో భామిని బయలుదేరి వెళతారు. రాత్రికి అక్కడే బస చేస్తారు.

అధ్వానంగా గ్రోయిన్లు

ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని సాగునీటి వనరులు

- వరద ధాటికి ధ్వంసమైన రాతి పేర్పులు
- కాలువల్లో పేరుకుపోయిన పూడిక
- ఆయకట్టుకు నీరు సరిగా అందక రైతుల ఇక్కట్లు



శారదా నది వరద ఉధృతికి ధ్వంసమైన సీతానగరం గ్రోయిన్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

శారదా నదిపై పలుచోట్ల వున్న గ్రోయిన్‌ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ప్రభుత్వాలు మారుతున్నా.. వీటి మరమ్మతుల ప్రతిపాదనలు అమలుకు నోచుకోవడం లేదు. గ్రోయిన్లు అధ్వానంగా వుండడంతో కాలువలకు నీరు ప్రవహించక, ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందడంలేదని రైతులు వాపోతున్నారు.

శారదా నదిపై చోడవరం, అనకాపల్లి, మునగపాక, రాంబిల్లి మండలాల్లో పలుచోట్ల గ్రోయిన్లు, ఆనకట్టలు వున్నాయి. వీటి కింద సుమారు 20 వేల ఎకరాల ఆయకట్టు వుంది. శారదా నదిలో వరద ఉధృతికి గ్రోయిన్లు దెబ్బతింటుంటాయి. వీటికి సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో క్రమేపీ పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి. ఇంకా పంట కాలువల్లో ఏళ్ల తరబడి పూడికలు తీయడంలేదు. దీంతో గ్రోయిన్ల ద్వారా కాలువల్లోకి నీరు సరిగా ప్రవహించడంలేదు. ఆయకట్టుకు నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. గ్రోయిన్‌ల నిర్వహణ పనులకు ఏటా నిధులు మంజూరు చేస్తే.. ఈ పరిస్థితి వుండేది కాదని అన్నదాతలు వాపోతున్నారు. గత కొన్నేళ్లుగా గ్రోయిన్‌ల మరమ్మతులు, నిర్వహణ పనులకు నిధులు విడుదల కావడం లేదు.

అనకాపల్లి మండలం సీతానగరం, బవులువాడ, తుమ్మపాల, మునగపాక మండలం ఉమ్మలాడ వద్ద వున్న గ్రోయిన్‌లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో కొన్నిచోట్ల నది గట్లు బలహీనపడ్డాయి. బవులువాడ, సీతానగరంలో నిర్మించిన ఆనకట్టలు వరద ఉధృతికి దెబ్బతిన్నాయి. చోడవరం మండలంలో పెద్దేరు నదిపై బెన్నవోలు, శ్రీరామపట్నం, గౌరీపట్నం వద్ద వున్న గ్రోయిన్‌లు సైతం పూర్తిగా దెబ్బతిన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఒక్క ఏడాది కూడా గ్రోయిన్‌ల మరమ్మతులకు/ నిర్వహణ పనులకు నిధులు మంజూరు చేయలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత శారదా నది గ్రోయిన్‌ల మరమ్మతుల కోసం జల వనరుల శాఖ అధికారులు ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆరు నెలలు దాటినా.. నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గ్రోయిన్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసి, వచ్చే ఖరీఫ్‌లోగా పనులు పూర్తి చేయించాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



తుమ్మపాల గ్రోయిన్ కాలువ కాంక్రీట్ లేచిపోయి బయటపడిన రాతి పేర్పు

సేంద్రీయ సాగుకు పెద్దపీట

ఆర్గానిక్ ఉత్పత్తుల పెంపునకు ప్రభుత్వం కృషి

- ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే డబ్బులు జమ
- హోం మంత్రి వంగలపూడి అనిత
- గుడివాడలో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం

ఎస్.రాయవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

సేంద్రీయ వ్యవసాయాన్ని గణనీయంగా పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మండలంలోని గుడివాడ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'రైతన్నా మీ కోసం' కార్యక్రమంలో ఆమె పాల్గొని, రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పలు రకాల ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తున్నదని చెప్పారు. ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లో వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతున్నదని, గత వైసీపీ హయాంలో 24 రోజులుదాటినా డబ్బులు అందేవి కావని గుర్తు చేశారు. మార్కెట్‌లో సేంద్రీయ వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తులకు అధిక గిరాకీ వుందని, అందువల్ల తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందడానికి రైతులు సేంద్రీయ విధానంలో పంటల సాగుపై దృష్టి పెట్టాలని మంత్రి అనిత కోరారు. పాయకరావుపేట నియోజకవర్గంలో మూడు వేల ఎకరాల్లో మాత్రమే సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారని, వచ్చే ఏడాది 14 వేల ఎకరాల్లో సేంద్రీయ వ్యవసాయం అమలు చేయాలని వ్యవసాయ శాఖ ఏడీని ఆమె ఆదేశించారు. అనంతరం పలువురు రైతులతో ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులకు అందుతున్న పథకాలతోపాటు పంటల సాగుకు సంబంధించిన పలు విషయాలపై వ్యవసాయ శాఖ ఏడీని ఆరా తీశారు. అనంతరం పలువురు కౌలు రైతులకు సీసీఆర్సీ [illegible] అందజేశారు. వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన మదర్ థెరెసా మహిళా సహకార సంఘం సభ్యులకు రూ 2.54 లక్షల చెక్కును అందజేశారు. అంతకుముందు గ్రామంలో పర్యటించిన ఆమె డ్రాగన్ ఫ్రూట్ సాగును పరిశీలించారు.



'రైతన్నా మీ కోసం' కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతున్న అనిత

ఈ కార్యక్రమంలో తహశీల్దారు రమేశ్‌బాబు, ఎంపీడీవో మీనాకుమారి, వ్యవసాయ అధికారి సౌజన్య, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, నియోజకవర్గ కన్వీనర్ కె.వెంకటేశ్, ఎంపీపీ వెంకటలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, సర్పంచ్ ధూళి శ్రీనుబాబు, మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, నాయకులు ఎన్.వెంకటరాజు, తుమ్మపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, రెడ్డి పవన్‌కుమార్, అల్లు నరసింహమూర్తి, భీమరశెట్టి శ్రీనివాసరావు, కోడ లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న హోం మంత్రి అనిత

పేట పీహెచ్‌సీలో మంత్రి అనిత తనిఖీలు

డాక్టర్ లేకపోవడంతో అసహనం

- పరిసరాల అపరిశుభ్రతపై ఆగ్రహం
- డాక్టర్‌తోపాటు సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డీఎంహెచ్‌ఓకు ఆదేశం

పాయకరావుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో డాక్టర్ అందుబాటులో లేకపోవడంపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అసహనం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం ఇక్కడకు వచ్చిన ఆమె 2.30 గంటల సమయంలో వై జంక్షన్ సమీపంలో మెయిన్‌రోడ్డు పక్కనున్న పీహెచ్‌సీని తనిఖీచేశారు. ఈ సమయంలో డాక్టర్ విధుల్లో లేకపోవడాన్ని గుర్తించారు. అనంతరం అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విధులకు హాజరైన నర్సు రిజిస్టర్‌లో సంతకం చేయకపోవడంతోపాటు యూనిఫారమ్‌లో లేకపోవడంపై మంత్రి ప్రశ్నించారు. అనంతరం ల్యాబ్, వార్డులు, ఫార్మసీని పరిశీలించి ఓపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరువాత ఆస్పత్రి ఆవరణను పరిశీలించిన ఆమె.. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడిన ఆమె.. పీహెచ్‌సీ డాక్టర్‌కు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీచేసి వివరణ కోరాలని ఆదేశించారు. ఇదే సమయంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సుభాశ్ వచ్చి, హోం మంత్రిని కలిశారు. మధ్యాహ్న భోజనానికి ఇంటికి వెళ్లినట్టు వివరణ ఇచ్చారు. ఆస్పత్రిలో ఎవరూ లేకుండా ఇంటికి వెళ్లడం ఏమిటని మంత్రి ప్రశ్నించారు.

దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలు

సీఎస్ఆర్ నిధులతో మంజూరు



తన క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు

- అంత్యోదయ కార్డులు జారీ అయ్యేలా కృషి
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు హామీ
- దివ్యాంగుల సంక్షేమ భవనానికి స్థలం కేటాయిస్తున్నట్టు వెల్లడి

నర్సీపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

నర్సీపట్నంలోని దివ్యాంగులందరికీ సీఎస్ఆర్ నిధులతో బ్యాటరీ వాహనాలు మంజూరు చేయిస్తానని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఇక్కడ తన క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి త్వరగా భర్తీ చేయించడానికి కృషి చేస్తానని చెప్పారు. అర్హులైన దివ్యాంగులకు ప్రతి నెలా ఉచితంగా 35 కిలోల బియ్యం ఇచ్చేలా అంత్యోదయ రేషన్ కార్డులను మంజూరు చేయిస్తానని, అయితే ఇది రాష్ట్ర స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయమని అన్నారు. దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలు మంజూరు చేసిన తరువాత వారికి అవసరమైన లైసెన్సులు కూడా ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించామని ఆయన తెలిపారు. డ్వాక్రా సంఘాల మాదిరిగా దివ్యాంగులు కూడా గ్రూపులుగా ఏర్పడితే బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు మోక్షం

- రూ.5 కోట్లతో పలు పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయం
- రెండు, మూడు రోజుల్లో తుది ప్రతిపాదనలు

చోడవరంలో శాశ్వత పరిష్కారానికి చర్యలు



భారీ వర్షంతో పంట కాలువను తలపిస్తున్న బాలాజీనగర్‌లోని ఓ వీధి (ఫైల్ ఫొటో)



బానయ్యకోనేరు ప్రాంతంలో ఇళ్లలోకి చేరిన వరద నీరు (ఫైల్ ఫొటో)

చోడవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

చోడవరంలో చిన్నపాటి వర్షం కురిసినా ముంపునకు గురవుతున్న పలు కాలనీల్లో డ్రైనేజీల నిర్మాణంతోపాటు వర్షం నీరు సాఫీగా బయటకు పోయేలా అధికారులు ప్రణాళికను రూపొందిస్తున్నారు. ఎంతోకాలంగా పట్టణవాసులను వేధిస్తున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి పాలకులు నడుంబిగించారు. ఇందుకోసం రూ.5 కోట్లతో వివిధ పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం అవుతున్నది. స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు రెండు,మూడు రోజుల్లో పట్టణంలో పర్యటించి, ఆయా ముంపు ప్రాంతాల్లో చేపట్టనున్న పనులను అంచనా వేస్తారు.

చోడవరం పట్టణంలో ఏటేటా జనాభా, నివాసాలు పెరుగుతున్నప్పటికీ.. రహదారులు, డ్రైనేజీ కాలువలు అభివృద్ధి, విస్తరణకు నోచుకోవడంలేదు. ప్రధానం డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారవడంతో కొద్దిపాటి వర్షం కురిసినా.. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతున్నది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షం నీరు చేరుతున్నది. ఈ సమస్య ప్రధానంగా బాలాజీనగర్, రెల్లికాలనీ, ఐటీ కాలనీ, కో-ఆపరేటివ్ కాలనీ, దుడ్డువీధి, బానయ్య కోనేరు, ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అధికంగా వుంది. ఎగువ నుంచి వచ్చే వర్షం నీరు బయటకు పోయే కాలువలు చిన్నవిగా ఉండడంతో బాలాజీనగర్, కో-ఆపరేటివ్ కాలనీ, రెల్లికాలనీ జలమయం అవుతున్నాయి. భారీ వర్షం కురిస్తే ఆయా ప్రాంతాల్లోని రహదారులు వరద నీటితో పంట కాలువలను తలపిస్తుంటాయి. కొన్నిచోట్ల ఇళ్లలోకి కూడా వరద నీరు చొచ్చుకువస్తున్నది. చోడవరం-చీడికాడ రోడ్డులో మోకాలిలోతున వర్షం నీరు ప్రవహిస్తుండడంతో వాహనాలతోపాటు, పాదచారులు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతున్నది. పట్టణంలో ముంపు సమస్య నివారణకు గత ప్రభుత్వ హయాంలో అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. కానీ నిధులు మంజూరు కాకపోవడంతో ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే రాజు.. పట్టణంలో ముంపు సమస్యపై దృష్టి సారించారు.

కలెక్టర్ పర్యటనతో..

ఈ ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని పలు కాలనీలను వరద నీరు ముంచెత్తింది. కొన్నిచోట్ల ఇళ్లలోకి సైతం నీరు చేరింది. కలెక్టర్ విజయకృష్ణన్ ఇక్కడకు వచ్చి బానయ్యకోనేరు, చీడికాడ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించి ముంపు పరిస్థితిని పరిశీలించారు. వరదనీరు పోయేందుకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ పర్యటించిన కొద్ది రోజుల తరువాత మళ్లీ భారీ వర్షాలు కురిసి రెల్లికాలనీ పూర్తిగా నీటమునిగింది. ఎమ్మెల్యే రాజు పర్యటించి, ముంపు సమస్యను మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ... మిగతా 6వ పేజీలో

ఏలేరు కాలువలో బాలుడి గల్లంతు



రిత్విక్ (ఫైల్ ఫొటో)

కశింకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని ఉగ్గినపాలెం వద్ద ఏలేరు కాలువలో పడి ఏడేళ్ల బాలుడు గల్లంతయ్యాడు. బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరగ్గా.. సాయంత్రం వరకు బాలుడి ఆచూకీ లభ్యంకాలేదు. దీనికి సంబంధించి ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాలిలా వున్నాయి.

అచ్యుతాపురం మండలం కొండకర్ల గ్రామానికి చెందిన సబ్బి శ్రీను, రోహిణి దంపతులకు రిత్విక్ (7), శ్రీకర్ అనే కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అయ్యప్పస్వామి ఇరుముడుల కోసం బుధవారం ఉదయం ఉగ్గినపాలెం వచ్చారు. రిత్విక్ తన బంధువు అయిన లక్షిత్‌తో కలిసి సమీపంలోని కాలువ వద్ద ఆడుకోవడానికి వెళ్లారు. ఈ క్రమంలో కాలువలో దిగి, నీటిలో మునిగిపోయారు. సమీపంలో వున్న ఒక యువకుడు దీనిని గమనించి వెంటనే కాలువలోకి దూకి లక్షిత్‌ను కాపాడాడు. రిత్విక్ నీటిలో మునిగిపోయి కనిపించలేదు. కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం అందుకున్న సీఐ అల్లు స్వామినాయుడు సిబ్బందితో వచ్చి గాలించారు. అనంతరం రాష్ట్ర విపత్తుల నిర్వహణ బృందం, అగ్నిమాపక సిబ్బందిని రప్పించి బోటు సహాయంతో కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. కానీ సాయంత్రం వరకు బాలుడి ఆచూకీ లభించలేదు. తహశీల్దారు తిరుమలరావు, రెవెన్యూ సిబ్బంది వచ్చి వివరాలు తెలుసుకున్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

అనకాపల్లి నుంచి కేజీహెచ్‌కు తరలిస్తుండగా అధికమైన పురుటి నొప్పులు

- వాహనాన్ని ఆపి.. పురుడుపోసిన సిబ్బంది
- ఆడ శిశువు జననం... క్షేమంగా తల్లీబిడ్డ



అంబులెన్స్‌లో పుట్టిన శిశువుతో ఆశా కార్యకర్త, 108 టెక్నీషియన్


అనకాపల్లి టౌన్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):

పురుటి నొప్పులు వచ్చిన గర్భిణిని స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా దారిలో ప్రసవం జరిగింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి గ్రామానికి చెందిన గర్భిణి జి.సోమేశ్వరి బుధవారం పురుటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు.. ఆమె గర్భం దాల్చి ఎనిమిది నెలలే కావడంతోపాటు శిశువు చాలా సన్నగా వుండడంతో ఇక్కడ డెలివరీ సాధ్యపడదని చెప్పారు. 108 అంబులెన్స్‌ను రప్పించి విశాఖపట్నం కేజీహెచ్‌కు పంపారు. అయితే మార్గమధ్యంలోనే సోమేశ్వరికి పురుటి నొప్పులు అధికం కావడంతో వాహనాన్ని ఆపి, ఆశ కార్యకర్త సహాయంతో అంబులెన్సు టెక్నీషియన్ నారాయణరావు, పైలట్ మణికుమార్ పురుడుపోశారు. దీంతో ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను కేజీహెచ్‌లో చేర్పించారు. ఇద్దరు క్షేమంగా వున్నారు.

ఏబీసీకి చిక్కిన ఏఎస్‌వో

వాహనాల విడుదలకు లంచం డిమాండ్

- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- రూ.10 వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



పట్టుబడిన గాజువాక సర్కిల్-3 ఏఎస్‌వో బి.కృష్ణ

గాజువాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

రేషన్ బియ్యం అక్రమ తరలింపు కేసులో సీజ్ చేసిన వాహనాలను విడుదల చేసేందుకు లంచం తీసుకుంటూ పౌర సరఫరాల శాఖ గాజువాక సర్కిల్-3 ఏఎస్‌వో బి.కృష్ణ బుధవారం ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గాజువాకకు చెందిన ఎ.నారాయణ వాహనాలు రెండు ఐదు నెలల కిందట అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా ఏఎస్‌వో కృష్ణ పట్టుకుని న్యూపోర్టు పోలీసులకు అప్పగించారు. ఆ వాహనాలను విడుదల చేయాలని పలుమార్లు ఏఎస్‌వోను కోరినప్పటికీ పట్టించుకోలేదు. డబ్బు ఇస్తేనే విడుదల చేస్తానని పట్టుబట్టాడు. దీంతో బాధితుడు హైకోర్టును ఆశ్రయించడంతో అతడికి అనుకూలంగా తీర్పు వచ్చింది. వాహనాలను తక్షణమే విడుదల చేయాలని జాయింట్ కలెక్టర్‌ను కోర్టు ఆదేశించింది. ఈ మేరకు సీజ్ చేసిన రెండు వాహనాలను నారాయణకు అప్పగించాలని జాయింట్ కలెక్టర్ గత అక్టోబరులో గాజువాక ఏఎస్‌వోను ఆదేశించారు. అయినప్పటికీ వాహనాలను అప్పగించేందుకు ఏఎస్వో లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు మంగళవారం ఏసీబీ కార్యాలయానికి వెళ్లి ఏఎస్‌వోపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పక్కా ప్లాన్ ప్రకారం బుధవారం సాయంత్రం గాజువాక ఏఎస్‌వో కార్యాలయంలో నారాయణ వద్ద నుంచి ఏఎస్‌వో కృష్ణ రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం కార్యాలయంలో పలు ఫైళ్లను పరిశీలించి, సిబ్బందిని విచారించారు. ఏఎస్‌వో కృష్ణపై కేసు నమోదు చేశారు. గురువారం కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: జడ్జి స్పందన



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి స్పందన

ఎలమంచిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఎస్‌రోడ్‌లోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎలమంచిలి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జి. స్పందన హాజరై మాట్లాడారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివ్యాంగుల హక్కులకు భంగం కలిగించకూడదన్నారు. ఎంఇఓలు సూర్యప్రకాశ్,అరుణ్ కుమార్, ఏజీపీ డి.వెంకట్రావు, న్యాయవాదులు టి.సత్యనారాయణ, హరి శంకరరావు, హెచ్ఎం, భవానీ, భవిత కేంద్రం నిర్వాహకులున్నారు.

దివ్యాంగుల పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ

అచ్యుతాపురం: స్థానిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు సీఎస్ఆర్ నిధులతో ప్రహరీ నిర్మిస్తామని ఎమ్మెల్యే విజయ కుమార్ హామీ ఇచ్చారు. మండల దివ్యాంగుల ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపకులు పీఎస్‌టీ పట్నాయక్ ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రాన్నిచ్చారు. భైలపూడి శ్రీరామదాసు, డ్రీమ్స్ నాయుడు, ద్వారపురెడ్డి బాపూజీ, శరగడం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు : ఎమ్మెల్యే

ఎలమంచిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జనవాణి ద్వారా వస్తున్న ప్రజా సమస్యలు పరిష్కారంలో జాప్యం వహించవద్దని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని జడ్పీ అతిథి గృహంలో జనవాణి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించి నియోజవర్గంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. ప్రజల సమ్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాఖల వారీగా వినతుల పరిష్కారానికి ఆదేశించారు. ఈ నెల 9వ తేదీన కూటమి పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించనున్న వనసమారాధన కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండలంలోని లైను కొత్తూరు సమీపంలో వనసమారాధన ఏర్పాట్లు చేస్తున్నట్లు జనసేన పార్టీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గొర్లె నానాజీ, కరణం రవి, కొఠారు శ్రీను, పూటకూటి రమేశ్, రాజాన నారాయణమ్మ, లాలం సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్‌కి లీడర్‌షిప్ అవార్డు



అవార్డును అందుకుంటున్న మార్కెటింగ్ మేనేజర్ కుషాల్ మోతియానీ

అచ్యుతాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ (బీఐఏసీ), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ నిర్వహించిన స్వచ్ఛ ఇండస్ట్రియల్ పార్క్ అవార్డ్-2025 బ్రాండిక్స్ సస్టయినబుల్ డెవలప్‌మెంట్ లీడర్‌షిప్ అవార్డు అందుకుంది. వ్యర్థ నిర్వహణ, పర్యావరణ స్థిరత్వం, మౌలిక వసతులు వంటి తదితర అంశాల మూల్యాంకనంలో దేశంలో ముందంజలో నిలిచిన పారిశ్రామిక పార్కుల్లో ఒకటిగా గుర్తింపుపొందినందున ఈఅవార్డు దక్కింది. ఈ వార్డును మార్కెటింగ్ మేనేజర్ కుషాల్ మోతియాని బుధవారం కొత్త ఢిల్లీలో స్వీకరించారు.

ఎమ్మెల్యేని కలిసిన దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్



ఎమ్మెల్యే విజయకుమార్ పుష్పగుచ్ఛమిస్తున్న ఇబ్రహీం బాషా

అచ్యుతాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ని అచ్యుతాపురంలోని ఆయన స్వగృహంలో రాష్ట్ర నూర్ బాషా దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ ఇబ్రహీం బాషా బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీలో సాధారణ కార్యకర్తగా ఉన్న తనను కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించటం పట్ల ఆయన కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బి. నాగేశ్వర్, కుమారస్వామి, దాసుబాబు, ఈశ్వరరావు, షేక్ మహబూబ్ సుభాన్, షేక్ ఆలీ, షేక్ ఉద్దీన్, టీడీపీ నాయకులు షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే హరిటేజ్ ధ్యేయం



పాడిరైతులతో మాట్లాడుతున్న మేనేజర్ శేషు

అచ్యుతాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుకు ఎళ్లవేళలా అండగా ఉంటామని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. బుధవారం ఎం. జగన్నాథపురం పాల సేకరణ కేంద్రంలో జరిగిన పాడిరైతుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఎంజేపురానికి చెందిన పోలినాటి ఎర్రి నాయుడు గతంలో పశువుల కొనుగోలు నిమిత్తం రూ.లక్ష రుణం తీసుకున్నారని, రెండు వాయిదాలు చెల్లించి మరణించారని, దీంతో ఆయన తీసుకున్న రుణాన్ని మాఫీ చేస్తున్నామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో భీముని నాగేశ్వరరావు, బాబూరావు, పి నూకరత్నం, రాంబాబు, కె సత్యారావు, బి చిన్నరమణ, జి రామకృష్ణ పాల్గొన్నారు.

మేజర్ ధ్యాన్‌చంద్‌కు నివాళి



మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పీడీ , విద్యార్థులు

ఎలమంచిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం మేజర్ ధ్యాన్ చంద్ 46 వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ డా. చంద్రశేఖర్, పిడి సతీష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్రీడా రంగానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు.

జూనియర్ కళాశాలను పరిశీలించిన జిల్లా అధికారి

రాంబిల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలంకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా ఇంటర్ మెడిట్ విద్యాశాఖాధికారి ఎం. వినోద్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడారు. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ తలపెట్టిన సంకల్ప్ 26కు సంసిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ ఎం.వి.ఎస్ నాయుడు ఉన్నారు.

జీవన ఎరువులను వినియోగించాలి: శాస్త్రవేత్త శ్రీహరి

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నేల సారాన్ని పెంచే జీవన ఎరువులను వినియోగించాలని సీనియర్ శాస్త్రవేత్త శ్రీహరి సూచించారు. మండలంలోని సత్యవరం గ్రామంలో బుధవారం నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు జీవన ఎరువుల ప్రాముఖ్యత, ఉపయోగాలను వివరించారు. జీవన ఎరువులను ఘన రూపంలో లేదా ద్రవ రూపంలో ఉపయోగించవచ్చన్నారు. వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం లాభసాటిగా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహించిందన్నారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్, పంటలకు మద్దతు ధరలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాండవ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం సీఈవో గుడివాడ సత్యనారాయణ, వ్యవసాయ సిబ్బంది ఎస్.వెంకట అప్పారావు, టిడిపి నాయకులు కీర్తి సీతారామ్, శిదిరెడ్డి నాగేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, వడ్డాది వాసు, రైతులు పాల్గొన్నారు.

'రైతన్నా.. మీకోసం' విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. బుధవారం హరిపురం హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ అధికారులు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడిపంటల సమ్మిళిత అభివృద్ధికి అధికారులు మరింతగా కృషిచేయాలన్నారు. దీనిద్వారా రైతుల తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యం కావాలన్నారు. పలువురు శాస్త్రవేత్తలు, అధికారులు యాంత్రికరణను మరింతగా ప్రోత్సహించడం ద్వారా ఎకరా సాగుపై కనీసం రూ.7వేలు పైనే ఆదాచేయవచ్చునన్నారు. పాడి అభివృద్ధిపై వివిధ కార్యక్రమాలను రాంబిల్లి పశువైద్యులు డాక్టర్ రఘునాథ్ వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీటీ కేవీకే చైర్మన్ బి.శ్రీరామూర్తి, వ్యవసాయాధికారులు సుమంత, మోహనరావు, బీసీటీ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజాకుర్రా, రాంబిల్లి జనసేన పార్టీ మండలశాఖ అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, పలువురు ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలోనే కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి



మునగపాకను అనకాపల్లిలోనే ఉంచాలని వైసీపీ శ్రేణుల నిరసన

మునగపాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు జారీ చేసిన జీవో 1491 ను రద్దు చేయాలని వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయ కర్త కరణం ధర్మశ్రీ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానికంగా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తహశీల్దార్ పి.సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. నాయకులు బొడ్డేడ ప్రసాద్, పెంటకోట స్వామిసత్యనారాయణ, ఆడారి గణపతి అచ్చింనాయుడు, మద్దాల వీరునాయుడు, బొద్దపు శ్రీరామ్మూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కంపెనీల్లో పనులు కల్పించాలని నిరసన



నిరసన తెలుపుతున్న కృష్ణంపాలెం నిర్వాసితులు

రాంబిల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపాలెం ఎస్ఈ జెడ్ భూ నిర్వాసితులు తమకు స్థానిక కంపెనీలో ముఠా, కలాసీ పనులు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహశీల్దార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, రాంబిల్లి సీఐకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తామ భూములు ఇచ్చిన స్థలంలో యాక్షన్ తెసా కంపెనీ నిర్మాణ పనుల్లో కలాసీ, ముఠా పనులు చేసుకొని జీవనం సాగించేవారమన్నారు. యాజమాన్యం తమను ఉన్నట్టుండి పనులు కల్పించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసిత సంఘం నాయకులు జి.దేముడునాయుడు, చందక రామకృష్ణ, రెడ్డి శంకరరావు, రెడ్డి శివప్రసాద్, రాజాన హరినాథ్, రాజాన అనీల్‌కుమార్, ధర్మిరెడ్డి రమణ, కశిరెడ్డి రాజేశ్, రాజాన రాజు పాల్గొన్నారు.

పెదపల్లిలో చెరువు పరిరక్షణకు కొనసాగుతున్న ఆమరణ దీక్షలు



దీక్ష చేసున్న వారికి మద్దతుగా ర్యాలీ చేస్తున్న పలు గ్రామాల ప్రజలు



దీక్ష చేస్తున్న వారిని పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ రమాకుమారి, వైసీపీ నేతలు

ఎలమంచిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పెదపల్లిలో చెరువు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి ముగ్గురు యువకులు చేపట్టిన ఆమరణ నిరహార దీక్ష బుధవారం నాటికి మూడో రోజుకు చేరింది. వీరికి మద్దతుగా పెదపల్లి, మంత్రిపాలెం, గొల్లలపాలెం గ్రామాలకు చెందిన వందలాది ప్రజలు, ప్రజా ప్రతినిధులు తరలివచ్చి ఎలమంచిలిలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దారు కార్యాలయం వద్ద ఉన్న దీక్ష శిబిరం వద్దకు చేరుకుని మానవహారం నిర్వహించారు. వీరితో పాటు చైర్‌పర్సన్ రమాకుమారి సైతం ర్యాలీలో పాల్గొన్నారు. ఈ శిబిరాన్ని వైసీపీ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, వైసీపీ రాష్ట్ర ప్రతినిధి బోదెపు గోవింద్, బొద్దపు శ్రీను(రమణ), బొద్దపు యర్రయ్యదొర, దాసరి కుమార్ తదితర నేతలంతా పాల్గొని దీక్షకు మద్దతు పలికారు. ఆమరణ నిరహార దీక్ష చేస్తున్న యువకుల బాధ్యత రెవెన్యూ అధికారులు వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పూర్వ రికార్డులు ప్రకారం ఉన్నతాధికారులు పరిశీలన చేసి చెరువు స్థలాన్ని కాపాడాలని పెదపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారు వరహాలుకు వినతిపత్రం అందజేశారు. సాయంత్రం చైర్‌పర్సన్ రమాకుమారి వచ్చి దీక్షలో ఉన్న వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. సీహెచ్‌సీ వైద్యురాలు నీహారిక దీక్ష చేస్తున్న ముగ్గురికి వైద్య తనిఖీలు నిర్వహించారు. ఒకరు నీరసించడంతో అంబులెన్స్‌లోనే వైద్య చికిత్స అందజేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ ధనుంజయరావు, ఎస్ఐ, సిబ్బంది విధులు నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత



ప్రజా దర్బార్‌లో సమస్యలు తెలుసుకుంటున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకుని సకాలంలో పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. స్థానికంగా వున్న తన క్యాంప్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు నాలుగు మండలాల నుంచి అనేక మంది తరలివచ్చారు. వారంతా తమ సమస్యలపై హోం మంత్రి అనితకు వినతి పత్రాలు అందజేశారు. మహిళలు, దివ్యాంగులు, వృద్ధులతో మంత్రి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రతీ సమస్యకు పరిష్కారం చూపడమే ప్రజా దర్బార్ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లకు సంబంధించి వినతులను మంత్రికి అందజేశారు.

మనోధైర్యంతో ముందుకు సాగాలి

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



కోటవురట్ల: విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కోటవురట్ల, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలని కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యాడ సుకుమార్ సూచించారు. పాఠశాలలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ దివ్యాంగులు ఎన్ని కష్టాలు వచ్చినా ఎదుర్కొనేందుకు ధైర్యంగా ఉండాలన్నారు. అంగవైకల్యం శరీరానికిగాని, మనస్సుకు కాదన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు. అనంతరం దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, బాలముకేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో...

నక్కపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగ పిల్లలకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. రన్నింగ్, మ్యూజికల్ చైర్, చిత్రలేఖనం పోటీలను హెచ్‌ఎం పి.విజయ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో నరేశ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో భవిత స్కూల్ టీచర్ అరుణ, ఫిజియోథెరిపిస్ట్ అనూష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవిత కేంద్ర వద్ద బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం గొండిరాజు మాట్లాడుతూ దివ్యాంగులు కూడా సమాజంలో ఒక భాగమేనన్నారు. వీరికి ప్రభుత్వ ఉద్యోగాలు, చదువుకు సంబంధించి పరీక్షల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ఉపయోగాలు కలిగిస్తున్నాయన్నారు. అంతేకాకుండా పాఠశాలల్లో చదువుకునే దివ్యాంగులకు ఏడాదికి రూ.6 వేలు నగదు, ఉపకరణాలు ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు త్రినాథరావు, అప్పారావు, మోహనరావు పాల్గొన్నారు.

టీడీపీ నేత రాజబాబుకు మంత్రి అనిత పరామర్శ



రాజబాబును పరామర్శిస్తున్న మంత్రి అనిత

పాయకరావుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటకు చెందిన టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు మాతృమూర్తి వెంకటలక్ష్మి ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆయనను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం పరామర్శించారు. పట్టణంలో రాజబాబు ఇంటికి చేరుకున్న మంత్రి అనిత ఆయన తల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రాజబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

కొండబాబు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి



కొప్పిశెట్టి కొండబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక గ్రామానికి చెందిన దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు కుటుంబ సభ్యులను బుధవారం సాయంత్రం హోం మంత్రి అనిత పరామర్శించారు. కొండబాబు కుమార్తె కొంకిపూడి సత్య అనారోగ్యంతో మంగళవారం రాత్రి మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జితో మంత్రి అనిత బుధవారం ఉదయమే ఫోన్‌లో మాట్లాడారు. సాయంత్రం ఉపమాక గ్రామంలో వున్న కొండబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సత్య మృతి పట్ల అనిత తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె భర్త జోగేశ్వరరావు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గం నేతలు కొప్పిశెట్టి వెంకటేశ్, లాలం కాశీనాయుడు, చించలపు పద్దు, అమలకంటి అబద్ధం, గుర్రం రామకృష్ణ ఉన్నారు.

మాజీ సర్పంచ్ బాబ్జీ కుటుంబానికి పరామర్శ

ఎస్.రాయవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గెడ్డపాలెం గ్రామానికి చెందిన టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచ్ దుబాసి తాతమ్మ బాబ్జీ కుటుంబాన్ని రాష్ట్ర హోం మంత్రి అనిత బుధవారం పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం బాబ్జి అనారోగ్య కారణంగా మృతి చెందారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి అనిత గ్రామానికి వెళ్లి బాబ్జి చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం అతడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా బాబ్జీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం తదితరులు నాయకులు పాల్గొన్నారు.

నేడు ఏనుగు కొండ గిరి ప్రదర్శన

అచ్యుతాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎం జగన్నాథపురంలోగల ఏనుగు కొండ గిరి ప్రదర్శన గురువారం జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈకొండ ఏనుగు ఆకారంలో ఉండడంతో దీనిని గజేంద్ర గిరిగా పిలుస్తారు. కొండపై భ్రమరాంబికా ఆలయం, కొండ దిగువన మల్లికార్జునస్వామి ఆలయం, కొండ వెనుక వేంకటేశ్వరస్వామి ఆలయం ఉంది. కొండ మాత్రం ఏనుగు ఆకారంలో ఉంటుంది. దీంతో ఈప్రాంతం శివకేశవ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఏటా మార్గశిర మాసంలో వచ్చే రెండో గురువారం గిరి ప్రదర్శన ఈప్రాంతీయుల ఆచారం. నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

పీడబ్ల్యూడీ సంఘాలకు రుణం



విభిన్న ప్రతిభావంతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మెప్మా పీడీ సరోజని

ఎలమంచిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెప్మా కార్యాలయ ఆవరణలో బుధవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా పి.డి సరోజని మాట్లాడారు. ఈ సందర్భంగా 6 పీడబ్ల్యూడీ సంఘాలకు రూ.40 లక్షల బ్యాంకు రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం పద్మావతి, వివిధ బ్యాంకుల మేనేజర్లు, మెప్మా అధికారులు, సిబ్బంది వరలక్ష్మి పాల్గొన్నారు.

మునగపాక: దివ్యాంగులు అన్ని రంగాల్లో సమర్థతను చాటుకుంటున్నారని ఎంఈవో వేణుగోపాలరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ పాఠశాలలో బుధవారం దివ్యాంగుల దినోత్సవం జరిగింది. జడ్పీ స్కూల్ హెచ్.ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మునగపాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ నెల 5వ తేదీన శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపు చేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ, మండల విద్యుత్ శాఖాధికారి శరగడం జగదీశ్ తెలిపారు. మునగపాక, పాటిపల్లి, వెంకటాపురం, టి.సిరసపల్లి, గవర్ల అనకాపల్లి, నారాయుడుపాలెం, కాకరాపల్లి తదితర గ్రామాల వినియోగదారులు సహకరించాలన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం

అచ్యుతాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లుస్థానిక ప్రశాంతి విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్ అధికారి ధనలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలో ఏడు రోజుల పాటు జరిగే శిబిరంలో ఉచిత వైద్య శిబిరాలు, డ్రగ్స్‌పై అవగాహన, వికసిత్ భారత్, స్వచ్ఛభారత్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం విద్యార్థులతో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు.

రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎస్. రాయవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవుపోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం అరుణ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఐశ్వర్య, భారతి, దుర్గాప్రసాద్ చక్కని ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. ఈ పోటీల్లో రాణిస్తున్న ముగ్గురు విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో విజేతలుగా రేవుపోలవరం పాఠశాలను ఉన్నత స్థానంలో నిలపాలని వారు ఆకాంక్షించారు. అలాగే కౌశల్ పోటీల్లో రాణిస్తున్న విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయిని స్వర్ణగౌరిను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ముంపు సమస్యకు మోక్షం

... 5వ పేజీ తరువాయి



వరద ముంపునకు గురైన రెల్లికాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, అధికారులు (ఫైల్ ఫొటో)

ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆయా కాలనీల్లో పర్యటించి ముంపు సమస్య పరిష్కారానికి చేపట్టవలసిన పనులను గుర్తించారు.

రూ.5 కోట్లతో ప్రణాళిక

చోడవరంలో ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి వివిధ రకాల పనులు చేపట్టాల్సి వుందని అధికారులు నిర్ధారించారు. ఇందుకు రూ.5 కోట్లు అవసరం అవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే ఎమ్మెల్యే రాజు ఆధ్వర్యంలో అధికారులు మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన చేసి, ఏయే పనులు చేపట్టాలో జాబితాను తయారు చేసే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. అనంతరం ఆయా పనులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతారు. ఆమోదం లభించిన వెంటనే పనులు మొదలుపెట్టి, వచ్చే ఏడాది వర్షాకాలంనాటికి పూర్తిచేయాలని ఎమ్మెల్యే, అధికారులు భావిస్తున్నారు.

నేడు డీడీవో కార్యాలయాలు ప్రారంభం

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలు గురువారం ప్రారంభం కానున్నాయి. విశాఖ డివిజనల్ కార్యాలయాన్ని జగదాంబ జంక్షన్ సమీప జోన్-4 కార్యాలయంలో ఏర్పాటు చేశారు. గతంలో మీసేవా కార్యాలయంగా ఉన్న ఫ్లోర్‌నే కేటాయించారు. భీమిలి, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరులో సొంత భవనాలు సిద్ధంచేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం ఉదయం 11 గంటలకు చిత్తూరు జిల్లా నుంచి డీడీవో కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ చేస్తారు. డీడీవో కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, మండల పరిషత్ కార్యాలయాల్లో మండల స్థాయి అధికారులు హాజరవుతాయని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

» మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపు


మాట్లాడుతున్న పీలా గోవింద సత్యనారాయణ

కశింకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో శతశాతం స్థానాలు గెలుపే లక్ష్యంగా కూటమి నాయకులు, కార్యకర్తలు పని చేయాలని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం అమీన్ సాహెబ్‌పేట గ్రామంలో 82వ బూత్‌లో క్లస్టర్, కేఎస్ఎస్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల్లో 82వ బూత్‌లో కూటమికి తక్కువ ఓట్లు రావడానికి గల కారణాలను కూటమి శ్రేణులను అడిగి తెలుసుకున్నారు. ఏఎస్ పేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు ఆవగడ్డ అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కాయల మురళి, ఉగ్గిన రమణమూర్తి, మజ్జి నిరంజన్‌కుమార్, నైనంశెట్టి రమణారావు, శివ, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ వేడుకలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6, 7 తేదీల్లో స్థానిక జీవీఎంసీ మునిసిపల్ ఉన్నత పాఠశాల (పెద్ద హైస్కూల్) 1975 బ్యాచ్ పదవ తరగతి పూర్వపు విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆ బ్యాచ్ అధ్యక్షకార్యదర్శులు షేక్ ఇస్మాయిల్, మళ్ల లోకేశ్వరరావు, కోశాధికారి రాపేటి నారాయణరావు తెలిపారు. బుధవారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ 6వ తేదీ ఉదయం హైస్కూల్ ప్రాంగణంలో గురు పూజోత్సవం, నేతాజీ విగ్రహావిష్కరణ, వేడుకల సంచిక ఆవిష్కరణ కార్యక్రమం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చేతుల మీదుగా నిర్వహించనున్నామన్నారు.

అనకాపల్లిలో ఏపీజీఈఏ సమావేశం రేపు

సబ్బవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా కేంద్రంలోని జీవీఎంసీ హైస్కూల్లో ఈ నెల 5న సాయంత్రం 4 గంటలకు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా సమావేశం జరుగుతుందని యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు షేక్ బాబూరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర యూనియన్ కార్యదర్శి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

నేటి నుంచి దేవీపురంలో దత్త జయంతి వేడుకలు

సబ్బవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవీపురంలో మార్గశిర పౌర్ణమి, దత్త జయంతి వేడుకలు గురువారం నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గురుమాత అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ దత్తాత్రేయస్వామికి భక్తులు నేరుగా పంచామృత అభిషేకాలు, దత్త హోమం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అదే విధంగా మార్గశిర పౌర్ణమి సందర్భంగా శ్రీ సహస్రాక్షి అమ్మవారికి పంచామృత అభిషేకాలు, సూక్త మహాలక్ష్మీ హోమం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం


దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కశింకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాలెం జిల్లా పరిషత్ స్కూల్ అసిస్టెంట్, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ కొరుప్రోలు వెంకటేశ్వరావు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణకుమారి పాల్గొని మాట్లాడారు. అనంతరం దివ్యాంగులకు ఏర్పాటు చేసిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు బి.వి.రమణమ్మ, ఎస్.దీప, డీపీఎన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, నంబర్ -1 ప్రధానోపాధ్యాయుడు గణపతి, నంబర్ -2 స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నేమాల రమణ, సామాజిక సేవా కార్యకర్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ


దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక లక్ష్మీనారాయణనగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం దివ్యాంగులకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శిలపరశెట్టి బాబీ, కర్రి శివుడు, కోటిపల్లి శ్రీను, మధుబాబు తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో బి.కోటేశ్వరరావు, బి.రామకృష్ణ, బి.వి.వరప్రసాద్ పాల్గొన్నారు.

'డీసీసీబీలో అక్రమాలపై విచారణ జరపండి'

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో 2019 నుంచి ఇప్పటి వరకు జరిగిన అనేక అవకతవకలపై సహకార చట్టం -51 ప్రకారం విచారణ జరపాలని అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం ఉపాధ్యక్షుడు విల్లూరి పైడారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బ్యాంకులో 2018 వరకు జరిగిన అక్రమాలపై తాము గతంలో చేసిన ఫిర్యాదు మేరకు సహకార అధికారి గోవిందరావు విచారణ జరిపి 348 పేజీల నివేదికను సహకార శాఖ రిజిస్ట్రార్‌కు అందజేశారని పేర్కొన్నారు. అయినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదన్నారు. బ్యాంకుకు ఛైర్మన్లగా వచ్చిన వ్యక్తులతో కలిసి సీఈవో పలు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. గతంలో లేని విధంగా పదోన్నతులలో ఛైర్మన్, సీఈవో కలిసి సొమ్ములు వసూలు చేశారన్నారు. నామినేటెడ్ ఛైర్మన్, సీఈవోలను తప్పించిన తరువాత వీటిపై సమగ్రంగా విచారణ జరపాలని కోరారు.

ఉత్సాహంగా టీచర్ల ఆటల పోటీలు

పరవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన మండల స్థాయి త్రోబాల్, క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. తొలుత పోటీలను ఎంఈవోలు జి. సాయి శైలజ, ఎం.దివాకర్‌రావులు ప్రారంభించారు. ఉపాధ్యాయులకు క్రికెట్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు ఎంఈవో దివాకర్‌రావు తెలిపారు.

సీఐటీయూ మహాసభల ప్రచార జాతా ప్రారంభం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈ నెల 31 నుంచి జరిగే సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభల ప్రచార జాతా కార్యక్రమం బుధవారం కూరగాయల మార్కెట్‌లో ప్రారంభమైంది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు జాతాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గంటా శ్రీరామ్, కాళ్ల తేలయ్యబాబు పాల్గొన్నారు.

నేడు కొత్తూరు సచివాలయం-2 ప్రారంభం

అనకాపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం కొత్తూరు గ్రామ సచివాలయం-2 భవనాన్ని గురువారం 11 గంటలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. అనంతరం ఆయన ప్రసంగిస్తారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

తడి, పొడి చెత్తను వేరుగా ఇవ్వాలి

అనకాపల్లి టౌన్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): వీధుల్లోకి జీవీఎంసీ వాహనాలు వచ్చేటప్పుడు తడి, పొడి చెత్తను వేరుగా సిబ్బందికి అందజేయాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి స్థానికులకు సూచించారు. బుధవారం రింగురోడ్డు, భీమునిగుమ్మం, నర్సింగరావుపేట ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు.

సిరులు కురిపిస్తున్న కూరగాయల సాగు

» రైతుల కష్టానికి తగిన ఫలితం దక్కుతున్న వైనం
» ఆసక్తి చూపుతున్న అన్నదాత
» పెరిగిన పంటల విస్తీర్ణం


తానాంలో సాగు చేస్తున్న బెండ, అరటి


వెన్నెలపాలెంలో సాగు చేస్తున్న బరబాటి

పరవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూరగాయల పంటల సాగుపై రైతాంగం ఆసక్తి కనబరుస్తున్నది. తక్కువ పెట్టుబడితో పాటు ఎక్కువ కష్టపడితే కూరగాయల సాగు సిరులు కురిపిస్తోందని రైతులు చెబుతున్నారు.

పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న పరవాడ మండలంలో రైతులు ఇటీవల కూరగాయల పంటలపై దృష్టి సారించారు. ప్రస్తుతం మార్కెట్‌లో వీటికి విపరీతమైన డిమాండ్ ఉంది. దీంతో చాలా మంది కూరగాయల పంటపైనే ఆసక్తి కనబరుస్తున్నారు. మండల వ్యాప్తంగా ఎక్కువగా వంగ, బెండ, బరబాటి, బీర, గోరుచిక్కుడు, టమాటా, పచ్చిమిర్చి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ పంటలను పండిస్తున్నారు. పరిశ్రమల అవసరాలకు పోను మిగిలిన భూముల్లో ఎక్కువ శాతం మంది రైతులు వీటినే పండిస్తున్నారు. పండిన కూరగాయలను గాజువాక, సింధియా, పూర్ణామార్కెట్, స్టీల్‌ప్లాంట్, తదితర ప్రాంతాలకు ఆటోలు, వ్యాన్‌లలో తరలించి అమ్మకాలు సాగిస్తున్నారు. పరవాడ, వెన్నెలపాలెం, తానాం, గొర్లెవానిపాలెం, చినతాడి, పి. బోనంగి, వీఎల్ఎస్ పురం, రావాడ, ధర్మారాయుడుపేట, వాడచీపురపల్లి, నాయుడుపాలెం, హస్తనాపురం, మెట్టపాలెం, బండారుపాలెం, పెదముషిడివాడ, కన్నూరు, బొద్దపువానిపాలెం, కొత్తవెన్నెలపాలెం, స్వయంభూవరం, శృంగారపాడు, తదితర గ్రామాల్లో ఎక్కువగా కూరగాయల పంటలనే సాగు చేస్తున్నారు. కూరగాయల సాగుతో ఆర్థికంగా లాభపడుతున్నామని రైతులు చెబుతున్నారు. ఇంటిల్లిపాది కష్టపడితే నెలకు రూ.40 వేలు నుంచి రూ.50 వేల వరకు సంపాదించుకోవచ్చని అంటున్నారు. కూరగాయలకు డిమాండ్ కూడా అధికంగా ఉందని వారు చెబుతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 150 హెక్టార్లపైనే కూరగాయల సాగు చేస్తున్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం కూరగాయల సాగు అధికంగా వుందని చెప్పాలి. మార్కెట్‌లో కూరగాయలకున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఎక్కువ శాతం రైతులు కూరగాయల పంటలపైనే మక్కువ చూపుతున్నారు. దీంతో కూరగాయల విస్తీర్ణం ఊపందుకుంది.

కార్పొరేట్ సంస్థలకు కేంద్రం దాసోహం

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య ఆరోపణ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య

తుమ్మపాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దాసోహమంటోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య ఆరోపించారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో వేలాది ఎకరాల భూములను కార్పొరేట్ సంస్థలకు తక్కువ ధరకు కట్టబెడుతున్నారన్నారు. విద్య, వైద్యాన్ని వ్యాపారంగా మార్చిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం మానుకోవాలన్నారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తుంటే రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోదీ ప్రభుత్వానికి వంత పాడుతున్నారని విమర్శించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శిగా రాజన్న దొరబాబు, జిల్లా సహాయ కార్యదర్శిగా రెడ్డి అప్పలరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్రాంతి వెంకటరమణ, జగ్గారావు, గురుబాబు, పరమేశ్వరి, రాదాకృష్ణ, ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.


అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

రెవెన్యూ సేవల్లో పారదర్శకతకు ప్రాధాన్యం

» కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సేవల్లో పారదర్శకత, సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ జాహ్నవితో కలిసి జిల్లా రెవెన్యూ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు రోజూ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసి సేవల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో వైసత్యనారాయణరావు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

సబ్బవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కల్వరి అపోస్థలిక్ చర్చిలో బిషప్ జాన్‌పాల్ ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, చోడవరం, సబ్బవరం, అచ్యుతాపురం, నక్కపల్లి మండలాలకు చెందిన వందలాది మంది పాస్టర్లు, బిషప్‌లు హాజరై ప్రార్థనలు చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి పాస్టర్లకు, బిషప్‌లకు తినిపించారు. అనంతరం 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం.జాన్‌పాల్, గ్రేస్‌పాల్, ప్రిన్సి సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన అవసరం

తుమ్మపాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని విద్యార్థినులకు ఎల్‌సీపీవో రమాదేవి సూచించారు. బాల వివాహ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాల ద్వారా పలు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. పిల్లలకు స్మార్ట్ ఫోన్ ఇవ్వకూడదని, చిన్నప్పటి నుంచి వారికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసింగ్‌లో డిజిటలైజేషన్ చాలా కీలకం

» ఎస్పీ తుహిన్ సిన్హా


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోలీసింగ్‌లో డిజిటలైజేషన్ చాలా కీలకమని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. బుధవారం రోటరీ కల్యాణ మండపంలో సీసీటీఎన్ఎస్ అప్‌గ్రేడియేషన్‌లో నైపుణ్యంపై జిల్లా పోలీసులకు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ సకాలంలో, కచ్చితంగా సీసీటీఎన్ఎస్ అప్‌గ్రేడియేషన్ చేయడం మాత్రమే కాకుండా కేసులు వేగవంతమైన అన్వేషణకు, నేరస్థుల గుర్తింపునకు రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర డాటా సమన్వయానికి కూడా దోహదపడుతుందన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ లేకుండా అన్ని వివరాలను అప్‌డేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, డీసీఆర్‌పీ సీఐ ఎల్.లక్ష్మణమూర్తి, ఎస్ఐలు ప్రసాద్, సురేశ్‌బాబు, శిరీష, సీసీటీఎన్ఎస్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ


మొగలిపురంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గండి రవికుమార్, తదితరులు

సబ్బవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గండి రవికుమార్ మొగలిపురం గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వలన విద్య, వైద్యంలో ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆధీనంలోనే కాలేజీల నిర్వహణ ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల యువజన విభాగం ఉపాధ్యక్షుడు యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, నేతలు ఐడీ బాబు, అంగటి సూర్యనారాయణ, ఐ గోపి, కోటేశ్వరరావు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

గౌరీ పీఏసీఎస్ టర్నోవర్ పెరుగుదలకు కృషిచేయాలి

» ఎమ్మెల్యే కొణతాల సూచన


పర్సన్ ఇన్‌చార్జి, పర్సన్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కోన తాతారావు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గౌరీ పీఏసీఎస్ వార్షిక టర్నోవర్ పెంచేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. బుధవారం స్థానిక రింగురోడ్డులోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో గౌరీ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కర్రి మహలక్ష్మి నాయుడు, పర్సన్లు కాండ్రేగుల నూకేశ్వరరావు (చిన్న), యల్లపు శ్రీనివాసరావులతో డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా సొసైటీ వ్యవస్థాపకుడైన రైతు బాంధవుడు వి.వి.రమణ చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మహలక్ష్మినాయుడు ఛైర్మన్‌గా వ్యవహరించినప్పుడు రూ.17 కోట్లు ఉన్న వార్షిక ఆదాయాన్ని రూ.45 కోట్లకు పెంచారన్నారు. ప్రస్తుతం రూ.75 కోట్లు ఉందని, దీనిని రూ.125 కోట్లకు తీసుకురావాలని సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అనకాపల్లిలో జీవీఎంసీ నిధులు రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ సహకార సంఘం అభివృద్ధికి కూటమి తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పర్సన్ ఇన్‌చార్జి, పర్సన్లను ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలాలు సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ, బీజేపీ మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి నాగమణి, అనకాపల్లి నియోజకవర్గంలోని కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తాం

» ఎమ్మెల్యే కొణతాల హామీ

కొత్తూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం రాజుపాలెం రైల్వే వంతెన నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హామీ ఇచ్చారు. బుధవారం రాజుపాలెం గ్రామ ప్రజలు, రైతులు రింగురోడ్డులో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. రైల్వే వంతెన మ్యాప్‌లో మార్పులు, చేర్పులు చేయాలని కోరారు. రైల్వే వంతెనలో జరుగుతున్న లోపాలను సవరించడానికి అధికారులతో ఫోన్లో మాట్లాడారు. రైల్వే వంతెనలో లోపాల సవరణ చేసేంత వరకు పనులను నిలిపివేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కాగా రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు చేసిన తప్పుల వల్ల కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారని, తమకు పూర్తిగా న్యాయం జరిగితే కోర్టులో దాఖలు చేసిన కేసును ఉపసంహరించుకుంటామని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత చేబోలు దుర్గాప్రసాద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

సబ్బవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు అరెస్టు చేసి బుధవారం కోర్టుకు తరలించారు. దీనికి సంబంధించి సీఐ డి.అనిల్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సబ్బవరం సర్కిల్ పరిధి పరవాడ మండలం తానాంలో అక్రమ మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు ఒక దుకాణంపై దాడి చేశారు. 8 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని, దుకాణం యజమాని రొంగలి రమణను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అదే విధంగా కలపాక(పరవాడ) గ్రామంలో అక్రమ మద్యం అమ్ముతున్న బొండా లక్ష్మిని బుధవారం అరెస్టు చేసి, ఆమె నుంచి 9 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించినట్టు సీఐ తెలిపారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఒకరి మృతి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ తీవ్ర గాయాలకు గురై విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్టు బుధవారం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ జి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. స్థానిక గవరపాలెం సంతోషిమాత ఆలయం వద్ద నివాసముంటున్న మొల్లి రామకృష్ణ(45) ఎలక్ట్రిషియన్‌గా, ప్లంబర్‌గా పని చేస్తుంటాడు. పనిలో భాగంగా మంగళవారం ఎన్టీఆర్ వైద్యాలయంలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ పరంజా పైనుంచి నేలపై పడిపోయాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన అతనిని ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు అతని భార్య లోవ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఏఎస్ఐ రామ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

'డ్రైనేజీ వెడల్పు తగ్గించి నిర్మాణం'

పరవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడ బొంకుల దిబ్బ వీధి సమీపంలోని సర్వే నంబరు 134లో గల గెడ్డ వాగులో నుంచి మండల పరిషత్ నిధులతో చేపడుతున్న సీసీ డ్రైనేజీని వెడల్పు తగ్గించి నిర్మిస్తున్నారని టీడీపీ మండల కార్యదర్శి పైలా చినఅక్కునాయుడు ఒక ప్రకటనలో ఆరోపించారు. గతంలో గెడ్డ వాగు ఎంత మేర ఉందో సర్వే చేయించి దాని ప్రకారం డ్రైనేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు.

వేడుకగా హనుమత్ వ్రతం


స్వామివారిని తమలపాకులతో అలంకరించిన దృశ్యం

లంకెలపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజోతి): జాతీయ రహదారి లంకెలపాలెం కూడలిలో కొలువై ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో మార్గశిర శుద్ధత్రయోదశని పురస్కరించుకొని బుధవారం హనుమత్ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేషంగా పంచామృతాభిషేకాలు, సహస్ర తమలపాకులార్చన జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మాదాసు శ్రీనివాసరావు, పచ్చికోరు రమణమూర్తి, మడక రమేశ్‌నాయుడు, సాలాపు వెంకటఅప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


రైతన్నా.. మీకోసం వర్క్‌షాపులో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి


గోమంగిలో రైతన్నా.. మీకోసంలో అధికారులు, టీడీపీ శ్రేణులు

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే లక్ష్యం

» టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయాన్ని సాభసాటిగా మార్చాలన్న దృక్పథంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంచ సూత్రాల ప్రణాళికను తీసుకువచ్చినట్టు టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని డోకులూరు పంచాయతీలో రైతు సేవా కేంద్రంలో అన్నదాతలతో బుధవారం నిర్వహించిన వర్క్‌షాపులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రైతుల సమస్యలు, కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంతోషం కోసం పీఎం కిసాన్, అన్నదాత, సుఖీభవ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వినూత్నంగా సాగు చేసే విధానాలు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా నీటి పొదుపు, వివిధ వాణిజ్య పంటలు, అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే అంశాల ఆధారంగా వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలని కృషి చేస్తున్నారన్నారు. మార్కెట్, వాతావరణానికి అనుకూల పంటలు సాగు చేయాలన్నారు. బిందు సేద్యం ద్వారా రైతులకు 90 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, మేలైన విత్తనాలను అందిస్తున్నట్టు ఆమె వివరించారు. కార్యక్రమంలో తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, పాడేరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి డప్పోడి వెంకటరమణ, టీడీపీ మండల అధ్యక్షుడు రేగం కొండబాబు, డోకులూరు సర్పంచ్ కె.సన్నిబాబు, జిల్లా పశువైద్యాధికారి జయరాజు, వ్యవసాయశాఖాధికారులు బి.ప్రభాకరరావు, ఎల్.రవీంద్రబాబు పాత్రుడు, ఎం.సూర్యనారాయణ నాయుడు పాల్గొన్నారు.

వ్యవసాయ ప్రగతికి పెద్దపీట : ఏఎంసీ చైర్‌పర్సన్

చింతపల్లి: గిరిజన ప్రాంతంలో వ్యవసాయ ప్రగతికి ప్రభుత్వం పెద్దపీటవేసిందని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళ అన్నారు. బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా కొత్తపాలెం గ్రామంలో గిరిజన రైతులతో వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ మాట్లాడారు. రైతులకు 90శాతం రాయితీపై రాజ్‌మా, వలిసెలు, అపరాల విత్తనాలు, ఎరువులు పంపిణీ చేస్తున్నామన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు కె. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ గంజాయికి ప్రత్యామ్నాయంగా గిరిజన రైతులకు ఉపాధిపథకంలోఉద్యాన పంటల మొక్కలను ఉచితంగా పంపిణీతోపాటు సాగుకు మూడేళ్ల ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారి టి. మధుసూదనరావు, రైతులు పాల్గొన్నారు.

పెదబయలు: రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ మండల అధ్యక్షులు కొండయ్య పేర్కొన్నారు. గోమంగి గ్రామంలో నిర్వహించిన రైతన్నా.. మీ కోసం కార్యక్రమంలో ఆయనపాల్గొని మాట్లాడారు. గిరిజన రైతుల అన్నదాత సుఖీభవ ద్వారా అందించిన పెట్టుబడులకు ఎంతో ఉపయోపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజారావు, వినోద్‌కుమార్, గంపరాయి ధనుంజయ్, భాస్కరరావు, తిరుపతిరావు, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు పూర్ణచంద్రరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ ఉర్మిళ

హామీలు అమలు చేసిన ఘనత 'కూటమి'దే

» విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర, అరకు పరిశీలకుడు కరణం శివరామకృష్ణ


టీడీపీలో చేరిన వైసీపీ నేతలను ఆహ్వానిస్తున్న దొన్నుదొర, శివరామకృష్ణ

అనంతగిరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర, టీడీపీ పరిశీలకుడు కరణం శివరామకృష్ణ అన్నారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ కేంద్రంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దొన్నుదొర, శివరామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా రైతులు, టీడీపీ నాయకులతో కలసి భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన ప్రతీ హామీని నురవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

ఈ సందర్భంగా వైసీపీ పార్టీ ఓసీ సెల్ జిల్లా కన్వీనర్ భీమవరపు గంగులుతోపాటుగా సుమారు 100 మంది టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ చంద్రబాబు పాలనకు ఆకర్షితులై వైసీపీని వీడి టీడీపీలో ఆపార్టీ నాయకులు పెద్ద ఎత్తున చేరుతునారని అన్నారు. స్థానిక సంస్థల టీడీపీ అభ్యర్థులను గెలిపించి, అధినాయకుడికి బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సోవేరి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు భీమరాజు, అరకువేలి మాజీ మండల అధ్యక్షులు శిట్టి బాబూరావు, యువ నేత డి.శ్యామ్ ఏఎంసీ చైర్మన్ బి.లక్ష్మి, మాజీ సర్పంచ్ రామయ్య, మహిళా నేత టి.ముత్యాలమ్మ, నాయకులు సందీప్, శంకరరావు, పి.జగన్ బాబు, వెంకటేష్, రైతులు, గిరిజనులు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శి బదిలీ ఆపాలి

పెదబయలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామావృద్ధికి అహర్నిశలు శ్రమించినా పంచాయితీ కార్యదర్శి బదిలీని ఆపాలని మండలంలోని పెదకోడపల్లి పంచాయితీ సర్పంచ్, పంచాయితీ ప్రజలు కోరారు. ఈ మేరకు బుధవారం సర్పంచ్ చిట్టిబాబుతో కలిసి ఇన్‌చార్జి ఎంపీడీవో పూర్ణయ్యకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యదర్శి ఎస్.వై. శివరామ్ గ్రామాభివృద్ధి, సంక్షేమానికి ఎంతో కృషి చేశారని వివరించారు. అలాగే, మహిళ పో లీసు ఇద్దరూ మంచి పాలన అందించారన్నారు. వీరి బదిలీ ఆపాలని కోరారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు సింహాచలం,నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏజెన్సీలో డ్రోన్ల ద్వారా మందుల పంపిణీ

» పాడేరు ఆస్పత్రి నుంచి ప్రారంభించే యోచన

అమరావతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డ్రోన్ల ద్వారా మందుల పంపిణీకి ఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టనుంది. సీఎం చంద్రబాబు సంకల్పం మేరకు వైద్య సేవల్లో డ్రోన్లు వినియోగించే సంస్థతో ఆరోగ్యశాఖ చర్చలు జరుపుతోంది. ఈ క్రమంలో అరుణాచల్‌ప్రదేశ్‌లో డ్రోన్ల ద్వారా మందులు, బ్లడ్ యూనిట్లు పంపుతున్నసంస్థ.. ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ కింద తొమ్మిది నెలల పాటు రాష్ట్రంలో ఉచితంగా సేవలందించేందుకు ముందుకొచ్చింది. గిరిజన ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంగా ప్రయోగాత్మకంగా డ్రోన్ల ద్వారా ప్రాథమిక, సామాజిక, ఏరియా ఆరోగ్య కేంద్రాలకు మందులు, బ్లడ్ యూనిట్లు పంపించాలని అధికారులు యోచిస్తున్నారు. ప్రస్తుతం పాడేరు నుంచి దూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వాహనాల ద్వారా లేదా సిబ్బంది ద్వారా మందులు పంపుతున్నారు. పాడేరు కేంద్రంగా మూడు నుంచి నాలుగు డ్రోన్లను వినియోగించి.. సుమారు 60 నుంచి 80 కిలోమీటర్ల దూరంలోని ప్రాథమిక, సామాజిక, ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలకు మందులు, బ్లడ్ యూనిట్లు, వ్యాక్సిన్లు పంపించేందుకు అవకాశం ఉంది. మందులు అందజేసిన తర్వాత ఆయా ఆస్పత్రుల నుంచి రక్త, మల, మూత్ర నమూనాలను తీసుకొని డ్రోన్ తిరిగి పాడేరుకు చేరుకుంటుంది. అనుమతులు లభిస్తే విశాఖ కేజీహెచ్ నుంచి పాడేరుకు మందులు తీసుకురావడానికి కూడా డ్రోన్లను వినియోగించాలని భావిస్తున్నారు.

టీడీపీ యూత్ ప్రెసిడెంట్‌గా శ్యామ్


దొన్నుదొరకు పుష్పగుచ్ఛమందిస్తున్న దుంబరి శ్యామ్

అనంతగిరి, డిసెంబరు 3, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు పంచాయతీ శివలింగపురానికి చెందిన దుంబరి శ్యామ్‌ను అనంతగిరి మండల టీడీపీ యూత్ ప్రెసిడెంట్‌గా అరకు నియోజకవర్గం ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని,అలాగే యువ కార్యకర్తలను పార్టీ కోసం తయారు చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా శ్యామ్ దొన్నుదొరకు కృతజ్ఞతలు తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాసరావు


రాజేంద్రపాలెం సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

కొయ్యూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొయ్యూరు డిప్యూటీ ఎంపీడీవోగా టి. శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం పీఆర్ డివిజన్ కార్యాలయంలో పనిచేస్తూ పదోన్నతిపై శ్రీనివాసరావును డిప్యూటీ ఎంపీడీవోగా నియమించారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన వెంటనే రాజేంద్రపాలెం సచివాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అమలుపై సిబ్బంది చేపడుతున్న చర్యలను పరిశీలించారు. వర్క్ ఫర్ హోం కౌసల్యం పథకంలో అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పరీక్షను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి అడ్డంకిగా విద్యుత్‌లైన్


ఇన్‌చార్జి ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న తురుతుంపాడు సర్పంచ్ చిట్టిబాబు

చింతపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురుతుంపాడు గ్రామంలో పీవీటీజీలు గృహాల నిర్మాణాలకు ఆటంకంగా ఉన్న 33కేవీ విద్యుత్‌లైన్ తొలగించాలని లోతుగెడ్డ సర్పంచ్ చింతల్ల సునీల్ విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక గిరిజనులతో కలిసి స్థానిక ఏపీఈపీడీసీఎల్ ఏఈఈ మనుము ప్రభాకరరావుని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తురుతుంపాడు గ్రామం మధ్యనుంచి గతంలో 33కేవీ విద్యుత్‌లైన్ వేశారన్నారు. ప్రభుత్వం గ్రామంలో 25మంది ఆదివాసీలకు పక్కా గృహాలను మంజూరు చేసిందన్నారు. ఈ గృహాల నిర్మాణాలకు విద్యుత్ తీగలు అడ్డంకిగా ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బాబూరావు, గిరిజనులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

అరకులోయ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ కుమారస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రెడ్‌క్రాస్‌సొసైటీ పాడేరు వారి ఆధ్వర్యంలో ఉదయం పదిగంటల నుంచి ఈ రక్తదాన శిబిరం జరుగుతుందన్నారు. స్థానిక యువత ఈ కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు.

పోక్సో కేసు నమోదు

సీలేరు, డిసెంబరు 3 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం పోక్సో కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ ఎండీ యాసిన్ తెలిపారు. తన కుమార్తెను నమ్మించి మోసగించాడని బాధితురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆలయాల నిర్మాణానికి చర్యలు


హుకుంపేటలో స్థల పరిశీలనలో టీటీడీ అధికారులు, గ్రామస్థులు

హుకుంపేట డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి); ఆలయాల నిర్మాణాలకు దేవాదాయ శాఖ, టీటీడీలు ప్రత్యేక కృషి చేస్తున్నట్టు టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు సత్తిబాబు, దినేష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో స్థానికులు ఇక్కడ రామాలయ నిర్మాణం చేపట్టాలని టీటీడీ, దేవాదాయ శాఖలకు దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఇంజనీరింగ్ అధికారులు వచ్చి స్థలాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాల్లో సమష్టిగా ఆలయాలకు 10 సెంట్లు స్థలాన్ని కేటాయిస్తే నిధులు విడుదల చేస్తామని తెలిపారు. హుకుంపేటలో రూ. 20 లక్షలతో రామాలయం నిర్మాణానికి త్వరలో కొలతలు చేసి పనులు ప్రారం భించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కోమ రమ, వార్డు సభ్యుడు నాగుబాబు, భక్తులు కాంతమ్మ, సూర్యకాంతం, నైని సత్తిబాబు, సాగిరి సత్యవతి, సావిత్రి, లక్ష్మయ్య, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పక్కాగా యాక్షన్ ప్లాన్ అమలు: డీఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

ముంచంగిపుట్టు, డిసెంబరు 3, (ఆంధ్రజ్యోతి): ప్రతీ పాఠశాలలో 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పక్కాగా అమలు చేయాలని డీఈవో బ్రహ్మాజీరావు అ న్నారు. మండలంలోని కిలగాడలో బుధవారం హైస్కూల్ హెచ్‌ఎంలతో ఆయన సమావేశమయ్యారు. ముందుగా పలు పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు పలు పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి జవాబులను రాబట్టారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ పాఠశాలల్లో ఈనెల 5వ తేదీన జరిగే మెగా పేటీఎంకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పదోతరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయాలన్నారు. శత శాతం ఉత్తీర్ణతకు ప్రణాళికను తయారు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో చెల్లయ్య, ఎంఈవో కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, ప్రకాష్‌రావు, భాస్కర్‌రావు, రాజేశ్వరి, నారాయణరావు, విశ్వనాథం, త్రినాథ్‌రావు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులపై శ్రద్ధ చూపాలి


మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాద్

చింతపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక ఎంఈవో వీబీవీవీవీ ప్రసాద్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక భవిత కేంద్రంలో విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక సదుపాయాలు, రాయితీలు కల్పిస్తున్నట్టు చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసివిద్యాశాఖ అధికారులు భోజనాలు చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈవో-2 గెమ్మెలి బోడం నాయుడు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పథకాలపై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న జిల్లా నోడల్ ఆఫీసర్ గౌరీశంకరరావు

పాడేరురూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) వలంటీర్లు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్‌ఎస్‌ఎస్ బృందం బుధవారం లగిశపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దత్తత గ్రామాల్లో అభివృద్ధికి వలంటీర్లు చురుగ్గా పాల్గొనాలన్నారు. గంజాయి నిర్మూలన, సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ తదితర అంశాలపై వలంటీర్లు చైతన్య కార్యక్రమాలను చేపడతారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎన్.రసూల్, పి.కోటేశ్వరరావు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు బి.రమేష్‌బాబు, పి.జానకీరామ్, డాక్టర్.డి.సునీతదేవి, ఎం.రాధాకుమారి,యు.వారిజ, వలంటీర్లు పాల్గొన్నారు.

గంజాయి జోలికి వెళ్తే ఆస్తుల జప్తు : సీఐ


గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ వినోద్‌బాబు

చింతపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలని స్థానిక సీఐ ఎం. వినోద్ బాబు అన్నారు. బుధవారం స్థానిక వారపు సంతలో ఆదివాసీలతో ఆయన సమావేశమయ్యారు. గంజాయి వల్ల యువత విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గం జాయి దేశంలో ఎక్కడ పట్టుబడినా మూలాలు గిరిజన ప్రాంతంవైపు చూపిస్తున్నాయన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్య నేరమన్నారు. ఆదివాసీలు గంజాయి సాగు చేపట్టరాదన్నారు. రవాణాకు సహకరించరాదన్నారు. గంజాయితో పట్టుబడితే ఆస్తులను సైతం జప్తు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఐ ఎం. వెంకట రమణ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన చర్యలు: కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే అందుకు బాధ్యులపై చర్యలు తప్పవని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగనిర్ధారణ చర్యలు నిషేధమని అటువంటి చర్యలకు ఎవరూ పాల్పడకూడదన్నారు. చట్టాన్ని అతిక్రమించి ఎవరైనా పరీక్షలు నిర్వహిస్తే రూ.50 వేలు జరిమానా, ఐదేళ్ల జైలు శిక్ష పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. లింగ నిర్ధారణపై ఎటువంటి ప్రకటనలు సైతం చేయకూడదన్నారు. వైద్యారోగ్య, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు ఆస్పత్రులు, అల్ట్రా సౌండ్ టెస్టింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కె.కృష్ణమూర్తినాయిక్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డి.హేమలతాదేవి, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీబాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు అరకు వ్యాలీలో ఐక్య క్రిస్మస్ వేడుకలు

అరకులోయ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అరకులోయవాలీబాల్ గ్రౌండ్‌లో ఐక్యక్రిస్మస్ వే డుకలను గురువారం సాయంత్రం నిర్వహించనున్నారు. అరకువ్యాలీ క్రైస్తవ ఐక్యవేదిక, మిరాకిల్ సెంటర్ వైజాగ్ వారు సంయుక్తంగా నిర్వహించనున్నట్టు ఈ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు నిర్వాహకులు చేపట్టారు. క్రైస్తవ సహోదరి, సహోదరులంతా సాయంత్రం నుంచి జరిగే క్రిస్మస్ వేడుకలకు అంతా తరలిరావాలని అరకువ్యాలీ క్రైస్తవ ఐక్యవేదిక ప్రతినిధులు బురిడి ఆనందరావు, త్రినాధరావు, హుస్సేన్, రవి, బాబూరావు, రూబేన్,షేమ్మో తెలిపారు. క్రిస్మస్ సందేశాన్ని మిర సెంటర్ వైజాగ్ నుంచి అంతర్జాతీయ ప్రసంగికులు బ్రదర్ శామ్యూల్ కర్మోజీ,సిస్టర్ సుస్మిత కర్మోజి, ముఖ్య అతిథులుగా సీబీఎం ఫీల్డ్ డైరెక్టర్ రెవ.డా.వెయిన్ జోసెఫ్ పాల్గొంటున్నారన్నారు. ఈ వేడుక అనంతరం జనాలకు ప్రేమ విందు ఏర్పాటుచేశామన్నారు.

శిశువుల సంరక్షణకు ప్రత్యేక కేంద్రాలు: పీడీ


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరామ్‌పడాల్

ముంచంగిపుట్టు, డిసెంబరు 3, (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, కుటుంబ సంరక్షణ లేని ఐదేళ్లలోపు శిశువుల సంరక్షణకు ఏర్పాటుచేసిన ప్రత్యేక కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ చిట్టపులి ఝాన్సీరామ్‌పడాల్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో పీడీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు సాంకేతిక మార్పులకు అనుగుణంగా విధులు నిర్వహించాలని తెలిపారు. కేంద్రాలు ప్రతీ రోజు సాయంత్రం 4వరకు తెరిచి ఉండాలని, జిల్లాలో మొబైల్ ద్వారా డేటాను అప్‌లోడ్ చేయటంలో ముంచంగిపుట్టు మండలం ప్రాజెక్టు వెనకబడి ఉం దన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అం దించాలని తెలిపారు. సమావేశానికి గైర్హాజరైన కార్యకర్తలకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని సీడీపీవో విమలకుమారికి సూ చించారు. జిల్లాలో 192 అంగన్ వాడీ కేంద్రాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానంలో కొత్త వాటి కోసం ప్రతిపాదనలు పంపిస్తామని ఆమె విలేకరులకు తెలిపారు.

మెలకువలు పాటిస్తే అధిక పంట దిగుబడి: ఏవో


మాట్లాడుతున్న ఏవో మురళీకృష్ణ

ముంచంగిపుట్టు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో మెలకువలు పాటిస్తే అధిక పంట దిగుబడి సాధించవచ్చునని ఏవో మురళీకృష్ణ అన్నారు. రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలో గల జర్జుల పంచాయతీ రైతు సేవా కేంద్రంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కాలానికి అనుగుణంగా ఏ రకమైన పంటలను వేయాలని కోరారు.

డుంబ్రిగుడ: రైతుల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారుల యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ అధికారి వాసుదేవరావు సమక్షంలో టీడీపీ మండల అధ్యక్షులు ఆనందరావుతో కూటమి నాయకులు సీఎం చంద్రబాబు వీడియో సందేశంలో పాల్గొన్నారు. నీటి భద్రత డిమాడ్ ఆధారిత పంటలతోపాటు అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాల్లో రైతులు రాణించాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు భీమారావు, చినగెన్ను, బోంజుబాబు, దన్నేరావు, భాస్కరరావు, రబి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

గూడెంకొత్తవీధి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని డిజిటల్ గ్రీన్ ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాతోట ట్రైబల్ ఫార్మింగ్ ప్రొడ్యూసర్ కంపెనీ, డిజిటల్ గ్రీన్, గిరిజన వికాస్, మైక్రోసాఫ్ట్ సంయుక్తంగా గిరిజన రైతులకు డిజిటల్ సాధనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ఎఫ్‌పీవోల బలోపేతానికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతుల వ్యవసాయ ప్రగతికి ప్రత్యేక యాప్‌లు అందుబాటులోవున్నాయన్నారు. వీటి సమాచారం తెలుసుకుని వ్యవసాయంలో రాణించాలన్నారు.

జెన్‌కో ఎస్‌ఈకి సన్మానం

సీలేరు, డిసెంబరు 3 , (ఆంధ్రజ్యోతి) : ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు ఇన్‌చార్జి ఎస్‌ఈగా, పంప్డ్ స్టోరేజీ ఎస్‌ఈగా విధులు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ చేసిన బి చంద్రశేఖర్‌రెడ్డిని బుధవారం రాత్రి స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎస్‌ఈ దంపతులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు వై. దార్రాజు, ఆర్‌ఎల్ రామకృష్ణ, బాబి, శేఖర్, భీమరాజు జెన్‌కో ఏవో ఈవీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గుంటవాడ జలాశయంలో 22 కిలోల చేప లభ్యం

సీలేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్తవీధి మండలం సీలేరులో గల గుంటవాడ జలాశయంలో బుధవారం 22 కిలోల చేప లభ్యమైంది. ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల్లో గల కోందుగూడ గిరిజనులు ప్రతిరోజు గుంటవాడ జలాశయంలో చేపల వేటకు వెళుతుంటారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం వేటకు వెళ్లిన గిరిజనుల వలకు 22 కిలోల చేప చిక్కింది. ఈ చేపను సీలేరులో దోబీ చేపగా పిలుస్తారు. గిరిజనులు అమ్మకానికి తీసుకురాగా స్థానిక బాలాజీ రెస్టారెంట్ యజమాని రూ.4 వేలకు కొనుగోలు చేశారు.

ముంపు సమస్యకు మోక్షం

... 5వ పేజీ తరువాయి


వరద ముంపునకు గురైన రెల్లికాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు, అధికారులు (ఫైల్ ఫొటో)

ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆయా కాలనీల్లో పర్యటించి ముంపు సమస్య పరిష్కారానికి చేపట్టవలసిన పనులను గుర్తించారు.

రూ.5 కోట్లతో ప్రణాళిక

చోడవరంలో ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి వివిధ రకాల పనులు చేపట్టాల్సి వుందని అధికారులు నిర్ధారించారు. ఇందుకు రూ.5 కోట్లు అవసరం అవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే ఎమ్మెల్యే రాజు ఆధ్వర్యంలో అధికారులు మరోసారి క్షేత్రస్థాయి పరిశీలన చేసి, ఏయే పనులు చేపట్టాలో జాబితాను తయారు చేసే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. అనంతరం ఆయా పనులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతారు. ఆమోదం లభించిన వెంటనే పనులు మొదలుపెట్టి, వచ్చే ఏడాది వర్షాకాలంనాటికి పూర్తిచేయాలని ఎమ్మెల్యే, అధికారులు భావిస్తున్నారు.


అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి

▸▸ అధికారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు

మాకవరపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధికారులకు ఆదేశించారు. మాకవరపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను అక్టోబరులో సభాపతి సందర్శించినప్పుడు అభివృద్ధి పనులకు స్వయంగా రూ.లక్ష విరాళం ప్రకటించడంతో పాటు మరో రూ.40 లక్షలు నిధులు సమీకరణకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇవి కాకుండా స్థానిక దాతల ద్వారా సేకరించిన విరాళాలతో కళాశాలలో పనులు మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం జూనియర్ కళాశాలను మరోసారి సందర్శించి అక్కడ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అత్యవసరంగా చేయాల్సిన పనులపై అధికారులతో సమీక్షించారు. పనుల నాణ్యతలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, తహశీల్దార్ వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ భారతశ్రీ, మాకవరపాలెం ఉప సర్పంచ్ లాలం రాము, పీఏసీఎస్ అధ్యక్షుడు చిన్నబాబు, పంచాయతీరాజ్ శాఖ జేఈఈ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో లేగదూడలను పెంచాలి

▸▸ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

రోలుగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు శాస్త్రీయ పద్ధతిలో లేగదూడలను పెంచడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చునని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని జె.నాయుడుపాలెంలో బుధవారం లేగదూడల ప్రదర్శన, పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల పెంపకంలో వైద్యులు, సిబ్బంది సలహాలు తీసుకోవాలన్నారు. లేగదూడల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న రైతులకు బహుమతులను అందజేశారు. కాగా, జెర్సీ, హెచ్‌ఎఫ్, ముర్రా, పుంగనూరు, ఒంగోలు, గిర్ వంటి జాతులకు చెందిన 48 లేగదూడలను ప్రదర్శించారు. మొదటి బహుమతి కిల్లాడ మాలినాయుడు, రెండో బహుమతి కిల్లాడ దేముడు, మూడో బహుమతి పోలిరెడ్డి కొండబాబులకు చెందిన లేగదూడలు ఎంపికయ్యాయి. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు బాలతేజ, దమయంతి, సర్పంచ్ బగుడు వెంకటరమణ, సిబ్బంది శివ, రాజు, వల్లిక, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు చౌడువాడ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన దుక్కా వర్షిణి... పుణ్యవతి

కె.కోటపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడ జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థినులు దుక్కా వర్షిణి, భీమరశెట్టి పుణ్యవతి అండర్-14 బాలికల జాతీయ స్థాయి రగ్బీ జట్టుకు ఎంపికయ్యారని హెచ్‌ఎం జి.వి.రమణరాజు బుధవారం తెలిపారు. గత నెల 30 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు కృష్ణాజిల్లా గన్నవరంలో జరిగిన అండర్-14 బాలికల రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా తరపున వీరు పాల్గొని ప్రతిభ చూపారన్నారు. ఈ మేరకు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. భువనేశ్వర్‌లో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. వారిని గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు అభినందించారు.

ఇరు వర్గాల మధ్య భూ వివాదం

▸▸ పోలీసుల రంగ ప్రవేశంతో ప్రశాంతం


దేవరాపల్లిలో ఘర్షణకు దిగుతున్న రైతులు

దేవరాపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లిలో భూ సమస్య ఇరు వర్గాల మధ్య చిచ్చు రేపింది. గొడవకు వారు సన్నద్ధం కావడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. విషయం తెలుసుకున్న స్ పి.సత్యనారాయణ హుటాహుటిన వివాదాస్పద ప్రాంతానికి చేరుకుని, పరిస్థితిని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్పీ వెంటనే స్పందించి జిల్లాలోని డీఎస్పీ ఎం.శ్రావణితో పపాటు పోలీసు బలగాలను దేవరాపల్లి పంపించారు. దీంతో బుధవారం సాయంత్రం డీఎస్పీ ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని చక్కదిద్దారు. ఇరు వర్గాలను వారిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తాము కొనుగోలు చేసిన భూమికి న్యాయస్థానం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని కిలపర్తి భాస్కరరావు ఆధారాలను డీఎస్పీకి చూపించారు. తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిని రెవెన్యూ రికార్డుల్లో తారుమారు చేశారంటూ వేచలపు అప్పలనాయుడు, జాగరపు రాజినాయుడు, జాగరపు వెంకటరావు తెలిపారు. న్యాయస్థానం తీర్పు కలిగిన కిలపర్తి భాస్కరరావు భూమి అభివృద్ధి చేసుకోవడానికి ఆటంకం కలిగించవద్దని అతని ప్రత్యర్థి వర్గానికి డీఎస్పీ సూచించారు. తమకు అన్యాయం జరిగిందని భావిస్తే కలెక్టర్, ఆర్డీవో లేదా కోర్టును ఆశ్రయించాలని ఆమె తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బైండోవర్ కేసు నమోదు చేసి పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్టు విలేకరులకు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ కోటేశ్వరరావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే విద్యుత్ ప్రమాదాల నివారణ

గొండగొండ/కృష్ణాదేవిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే విద్యుత్ ప్రమాదాల నివారణ సాధ్యమని విజిలెన్స్ ఎస్‌ఐ ఎస్.హేమవతి చెప్పారు. ఏటిగైరంపేట పంట పొలాల్లో విద్యుత్ వినియోగదారులు, రైతులతో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ విద్యుత్ వినియోగించేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో రొలుగొండట సెక్షన్ ఇన్‌చార్జి ఏఈ ఎస్.బంగారయ్య, విద్యుత్ లైన్‌మేన్లు తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రెండు నెలల జైలు శిక్ష

చోడవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సివిల్ కేసులో న్యాయస్థానం ముందుకు హాజరై అనుమతి లేకుండా పరారైన కేసులో నిందితుడికి రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ బుధవారం స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ తీర్పు ఇచ్చారు. చీడికాడ మండలం అర్జునగిరి గ్రామానికి చెందిన బూరె చిలుకును 2018 డిసెంబరు 4న ఓ సివిల్ వివాదంలో కోర్టుకు తీసుకువచ్చారు. నిందితుడు బూరె చిలుకు తన ప్రత్యర్థితో రాజీ చేసుకుంటానంటూ కోర్టు నుంచి పారిపోయాడు. దీనిపై కోర్టు ఫీల్డు అసిస్టెంట్ రుద్రరాజు వంశీవర్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారించిన జడ్జి చిలుకు దోషిగా తేల్చి అతనికి రెండు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ఏపీపీగా పి.హరిప్రియ నిందితుడికి శిక్ష పడేలా వాదించారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించండి

▸▸ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్




రైతన్నా మీకోసం సభలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్... డ్రిప్ ఇరిగేషన్ సాగు విధానం పరిశీలిస్తున్న కలెక్టర్, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు

బుచ్చెయ్యపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులు వినియోగం తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ సూచించారు. మండలంలోని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన రైతన్నా మీ కోసం వర్క్‌షాపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తు తరాల ఆరోగ్యం దృష్ట్యా క్రిమి సంహారక మందులు వాడవద్దని చెప్పారు. గాలి, నీరు, ఆహారం కలుషితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జిల్లాలో 12 మండలాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నాయని, మిగిలిన మండలాల్లో వ్యవసాయన్ని మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి రైతులు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ చోడవరం నియోజకవర్గాన్ని అగ్రికల్చర్ హబ్‌గా రూపొందిస్తామన్నారు. ప్రతీ మండలంలో కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మిస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ప్రతీ రైతుకు అన్నదాత సుఖీభవ పథకంలో ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయధికారి ఆశాదేవి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి వై.శ్రీనివాస్, తహశీల్దార్ ఎం.లక్ష్మి, మండల వ్యవసాయధికారి భాస్కరరావు, కేవీకే శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, సత్తిబాబు, కిశోర్, సౌజన్య, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

డ్రిప్ ఇరిగేషన్ సాగు విధానం పరిశీలన

కొండెంపూడి సభ అనంతరం స్థానిక రైతు వియ్యపు నాగరాజు ఆరు ఎకరాల భూమిలో సాగు చేస్తున్న డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. సీజన్‌తో సంబంధం లేకుండా అన్ని రకాల కూరగాయలు సాగు చేయడంపై కలెక్టర్ ప్రశంసించారు. జిల్లాలో మరింత మందిరైతులు ఈ పద్ధతిలో వ్యవసాయం చేయడానికి ప్రోత్సహిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఆమె వెంట జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జీవీ.లక్ష్మి, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.ఏ.రహీం, జిల్లా పశు సంవర్థక శాఖాధికారి రామ్మోహన్ ఉన్నారు.

మార్కెటింగ్ ఉన్న పంటలపైనే మొగ్గు చూపండి

▸▸ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



రైతుల వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చీడికాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలపైనే రైతులు మొగ్గు చూపాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన రైతన్నా మీ కోసంపై వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. ప్రతీ ఏటా ఒకే రకమైన విత్తనాన్ని వేయకూడదన్నారు. విత్తన మార్పిడితో పాటు విత్తన శుద్ధి చేసుకుంటే ఎటువంటి తెగుళ్లు సోకకుండా అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. పామాయిల్ సాగుకు అత్యధిక శాతం రాయితీ ఇస్తుండగా, పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం శతశాతం రాయితీ కల్పిస్తున్నదని చెప్పారు. అలాగే ప్రతీ ఏడాది పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు రైతుల ఖాతాలో జమచేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని చెప్పారు.

24 గంటల్లో ధాన్యం కొనుగోలు నగదు జమ

ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి భరోసా ఇచ్చారు. చీడికాడ రైతుసేవా కేంద్రం వద్ద బుధవారం ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సీఎం చంద్రబాబు మద్దతు ధర పెంచారని, రైతులంతా ప్రభుత్వ కేంద్రాలకే ఇవ్వాలని చెప్పారు. 24 గంటల్లో పేమెంట్లు పడకపోతే తనకు ఫోన్ చేయాలని, 60 నిమిషాల్లో పేమెంట్లు పడేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. చీడికాడ, దిబ్బపాలెం గ్రామాల్లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే మరో కేంద్రం ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గత ఏడాది గోవాడ షుగర్స్‌కు 25 టన్నుల చెరకు సరఫరా చేస్తే ఇంతవరకూ ఒక్క పైసా కూడా తనకు రాలేదని టీడీపీ సీనియర్ నేత యర్రా అప్పారావు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లామని, రైతులతో పాటు ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులకు కూడా న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కురచా జయమ్మ, తహశీల్దార్ కిశోర్‌లింకన్, ఎంపీడీవో హేమసుందర్రావు, వ్యవసాయ, పశు సంవర్థక శాఖల ఏడీలు రవీంద్రనాథ్, వి.చిట్టినాయుడు, ఏవో కృష్ణవేణి, రెండు సహకార సంఘాల చైర్‌పర్సన్లు గవిరెడ్డి జగన్నాథం, బొబ్బాది తాతారావు, కూటమి నాయకులు పోతల చిన్నంనాయుడు, జీవీ.మూర్తి, యర్రా అప్పారావు, గండి లక్ష్మి, బీళ్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రాజేశ్వరి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. మండంలోని కోతులు, కుక్కలు బెడద విపరీతంగా ఉందని, వీటి నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా వేములపూడి ఎంపీటీసీ-2 సభ్యుడు బోళెం రామ్‌ప్రసాద్, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ డిమాండ్ చేశారు. అలాగే రహదారులకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని జడ్పీటీసీ కోరారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తం చేయడానికి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అవగాహన కల్పిస్తామని రూరల్ ఎస్‌ఐ రాజారావు వెల్లడించారు. జలజీవన్ పథకం ద్వారా గ్రామాల్లో వేసిన రోడ్లను కొట్టేశారని, వాటిని పూర్తిచేయాలని వేములపూడి ఎంపీటీసీ-2 బోళెం రామ్‌ప్రసాద్ కోరారు. హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ హేమంత్ మాట్లాడుతూ మండలంలోని గతంలో 712 గృహాలు మంజూరు కాగా 421 గృహాలు పూర్తయ్యాయన్నారు. 252 గృహాలు గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని ఆయన తెలిపారు. పశువుల్లో గొంతు వాపు టీకాలు అందుబాటులో ఉన్నాయని చెట్టుపల్లి పశువైద్యాధికారిణి కె.పుష్ప తెలిపారు. యరకన్నపాలెం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎంపీపీ రాజేశ్వరి కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సత్యవతి మాట్లాడుతూ అప్పన్నపాలెంలో మ్యాజిక్ డ్రైన్ పనులు చేపట్టామన్నారు. అలాగే పలు శాఖల అధికారులు తమ శాఖల పనితీరును వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కె.ఉషశ్రీ, గ్రామ సచివాలయ పర్యవేక్షణ మండల అధికారి కె.మధుసూదనరావు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం


చోడవరంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకరరావు

చోడవరం/నర్సీపట్నం/గొలుగొండ/నాతవరం/రోలుగుంట, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల కేంద్రాలతో పాటు గొలుగొండ, నాతవరం, రోలుగుంట మండలాల్లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. చోడవరంలో సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకరరావు మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులకు గౌరవం ఇవ్వాలని, వారిని చిన్న చూపు చూడడం తగదని తెలిపారు. అలాగే దివ్యాంగుల హక్కులు, రక్షణ తదితర అంశాలను వివరించారు. దివ్యాంగులకు అవసరమైన న్యాయ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో న్యాయవాది సిహెచ్.సూర్యనారాయణ, దివ్యాగుల సంఘం ఉద్యోగ విభాగం నాయకులు దుగ్గిరాల రవికుమార్, ఆర్‌డీఎస్ ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు. అలాగే భవిత కేంద్రంలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవానికి ఎంఈవోలు ఎం.పాండురంగారావు, కె.సింహాచలం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగ బాలలకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు ఎంఈవోలు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విశాఖకు చెందిన ఉప్పలపాటి రాజేశ్ బాలలకు పుస్తకాలు, స్టేషనరీ సామగ్రి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఐవీ.రామిరెడ్డి పాల్గొన్నారు. నర్సీపట్నం భవిత కేంద్రంలో ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర పిల్లలకు ఆటల పోటీలు పెట్టి బహుమతులు అందజేశారు. దివ్యాంగులకు చేయూతనందిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారని వారు అన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, ప్రత్యేక బోధకుడు బి.అప్పారావు పాల్గొన్నారు.

గొండగొండలో జడ్పీటీసీ సభ్యులు ఎస్.గిరిబాబు మాట్లాడుతూ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులను పెద్ద మనసుతో ప్రోత్సహిస్తే ఉన్నతమైన శిఖరాలను అధిరోహిస్తారన్నారు. అనంతరం దివ్యాంగులకు నిర్వహించి ఆటలుపోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, ఎంఈవోలు సత్యనారాయణ, కృష్ణప్రసాద్, ఎస్‌ఐ పి.రామారావు, హెచ్‌ఎంలు కుమారి, నాగభూషణం, ఉపాధ్యాయులు తమ్మిన మాణిక్యం పాల్గొన్నారు. నాతవరంలో రిటైర్డ్ ఎంఈవో టి.అమృతకుమార్ సొంత డబ్బులతో దివ్యాంగులకు, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందుండాలని ఎంపీడీవో పి.పార్థసారథి పేర్కొన్నారు. దివ్యాంగులకు సాయం అందించిన అమృతకుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు, ఎస్‌ఐ తారకేశ్వరరావు, స్కూల్‌కమిటీ మాజీ చైర్మన్ సీతారామ్మూర్తి, హెచ్‌ఎం పైల వరహాలబాబు పాల్గొన్నారు. రోలుగుంట భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పిల్లలకు రన్నింగ్, మ్యూజికల్ చైర్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. ఎంఈవో జగ్గారావు మాట్లాడుతూ అవయవ లోపాన్ని మరచి స్వశక్తితో గర్వంగా జీవించేందుకు ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయులు శ్రావణి, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

చోద్యంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు


చోద్యం ఆర్‌అండ్‌బీ స్థలంలో పునాది వేసిన దృశ్యం

కృష్ణాదేవిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం చోద్యం కూడలిలోని అర్‌అండ్‌బీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేశారు. గతంలో ఈ స్థలాల్లో 40 ఏళ్లుగా పూరిపాకలు వేసుకుని జీవనోపాధి పొందుతున్న చిరు వ్యాపారులను రెవెన్యూ, అర్‌అండ్‌బీ అధికారులు మూకుమ్మడిగా తొలగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పక్కా భవన నిర్మాణాలకు కాంక్రీట్ పునాదులు వేశారని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికే కృష్ణాదేవిపేట-నర్సీపట్నం రహదారిని అనుకుని ఉన్న అర్‌అండ్‌బీ స్థలాల్లో కొంతమంది ఆక్రమణదారులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటంతో రోజురోజుకు రహదారి కుచించుకుపోతున్నదని వాహదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆక్రమణలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ జేఈఈ ప్రసాద్‌ను వివరణ కోరగా అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు మేరకు పనులు నిలిపి వేయాలని ఆదేశించినట్టు చెప్పారు.

'కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి'

నాతవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని తాండవ ప్రాజక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ పేర్కొన్నారు. గొలుగొండపేట గ్రామంలో బుధవారం జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రబీ, ఖరీఫ్ పంటలకు సంబంధించి ప్రభుత్వం ముందుస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. అనంతరం ఇక్కడ జరిగిన మండల స్థాయి వర్క్ షాప్‌లో నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్‌కు ప్రభుత్వం నుంచి మద్దతు ధర తదితర విషయాలను చర్చించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాధికారి సుగుణ, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

పొంగలిపాకలో...

మాడుగుల రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొంగలిపాక గ్రామంలో బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ, ఆరోగ్య శాఖల అధికారులు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ ద్వారా అభివృద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్, తదితర అంశాలను వివరించారు. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో సీఎం చంద్రబాబు రైతులకు సంబంధిత సందేశాన్ని చూపించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఉండూరు దేముడు, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిరావు, పీహెచ్‌సీ వైద్యులు శ్రీను పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం

రావికమతం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రావికమతం మండల వీఆర్వోల సంఘం ఎన్నికలు మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడిగా ఆసరి శ్రీనివాసరావు (చినపాచిల వీఆర్వో), ఉపాధ్యక్షుడిగా ఎల్.సాంబమూర్తి (మేడివాడ), ప్రధాన కార్యదర్శిగా బి.నాగరాజు (గర్నికం), సహాయ కార్యదర్శిగా బి.కమలమ్మ (కొమిర), కోశాధికారిగా జి.గణేశ్ (జెడ్.కొత్తపట్నం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీఆర్వోల సంక్షేమానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు.

పాఠశాలలకు క్రీడా సామగ్రి

చోడవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కొత్తూరు జడ్పీ బాలికల హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలి విడతలో 14 పాఠశాలలకు క్రీడా సామగ్రిని అందించారు. వాలీబాల్, క్రికెట్, షటిల్, చెస్, క్యారం బోర్డు, స్కిప్పింగ్ రోప్స్, జావలిన్, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ పోటీలకు సంబంధించిన సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఐవీ.రామిరెడ్డి, సీఆర్‌పీ కేవీఎం నాయుడు, పీఈటీలు భీమరాజు, గోవింద్, భవానీ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

చోడవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కిచారు. దేవదాయ శాఖ ఈవో కేఎస్‌వీ.తేజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 69 రోజుల ఆదాయం రూ.66,654 వచ్చింది. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో సత్యనారాయణ, ఆలయ అర్చకులు గుంటూరు శాంతా రామాచార్యులు, జీవీ ఎవీఎల్ ఆచార్యులు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిగా అప్పలరాజు

చోడవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిగా చోడవరానికి చెందిన రెడ్డిపల్లి అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనకాపల్లి కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, జాతీయ సమితి సభ్యుడు జేవీ.సత్యనారాయణల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో అప్పలరాజును ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆయనకు కార్మిక సంఘాల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

చోడవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండంలోని వెంకన్నపాలెం వద్ద ఆటోలో తరలిస్తున్న పది బస్తాల రేషన్ బియ్యాన్ని స్థానికులు పట్టుకుని పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. దీనిపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.

75 మందికి కంటి వైద్య పరీక్షలు

చీడికాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖండివరం తులసీ కల్యాణ మండపంలో బుధవారం కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని టీడీపీ యువ నేత ఎస్‌వీఎస్.నాయుడు ప్రారంభించారు. 76 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో ఆపరేషన్‌కు 27 మంది ఎంపికయ్యారని, వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని శంకర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్ తెలిపారు.

తెరుచుకున్న కోనాం రేషన్ డిపో

చీడికాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం రేషన్ డిపోను బుధవారం తెరిచి లబ్ధిదారులకు సరకులు అందించారు. రెండు రోజులుగా ఈ డిపో తెరవక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం ఉదయం డిపోను తెరిపించారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

మావోయిస్టు సానుభూతిపరులకు పోలీస్ కౌన్సెలింగ్

నాతవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సరుగుడు, తాండవ దళంలో పనిచేసి లొంగిపోయిన మావోయిస్టు సానుభూతిపరులకు బుధవారం సీఐ రేవతమ్మ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనుమానితుల కదలికలు ఉంటే తమకు తెలపాలని, సత్ప్రవర్తనతో బతకాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు.